
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కాంగిరేస్!

వరంగల్ ఎంపీ స్థానంలో భారీగా ఆశావహులు

- 42మంది దరఖాస్తు.. ఉద్యోగుల పేర్లను పరిశీలనకు తీసుకోని అధిష్ఠానం
- ఏఐసీసీకి మూడేసి పేర్లతో టీపీసీసీ ప్రతిపాదనలు
- సింగపురం ఇందిర, దొమ్మాటి సాంబయ్యల్లో చాన్స్ దక్కేదెవ్వరికో?
- ఇద్దరిలో విజయావకాశాలపై కాంగ్రెస్ అంతర్గత సర్వే
- మంత్రులు భట్టి, కొండా సురేఖ, పొంగులేటి, ఎమ్మెల్యేల అభిప్రాయాల సేకరణ
- అధిష్ఠానం నిర్ణయంపై కాంగ్రెస్ కేడర్‌లో ఉత్కంఠ

వరంగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ లోక్‌సభ సీటుపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ పెరుగుతోంది. ఈ టికెట్ కోసం అత్యధికంగా 42మంది దరఖాస్తు చేసుకోగా.. వీరిలో ఎక్కువమంది ఉద్యోగులే ఉండటంతో వారిని పరిగణనలోకి తీసుకోకుండా, పార్టీలో మొదటి నుంచి పని చేస్తున్నవారిని గుర్తించిన స్క్రీనింగ్ కమిటీ ముగ్గురు పేర్లతో కూడిన జాబితాను ఏఐసీసీకి పంపింది. ప్రధానంగా గత ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన సింగపురం ఇందిరా, దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్ పేర్లను స్క్రీనింగ్ కమిటీ ప్రతిపాదించింది. దీంతో ఏఐసీసీ ఎన్నికల కమిటీ ముగ్గురి బలబలాలపై అంతర్గత సర్వే నిర్వహిస్తోంది. అంతేకాకుండా వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, మంత్రుల అభిప్రాయాలను సీఎం రేవంత్‌రెడ్డి సేకరిస్తున్నారు.

42మంది దరఖాస్తులు

ఎస్సీ రిజర్వ్‌డ్ అయిన వరంగల్ ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లో భారీగా పోటీ ఏర్పడింది. ఫిబ్రవరి నెలలో గాంధీభవన్‌లో ఎంపీ టికెట్ ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. వరంగల్ ఎంపీ టికెట్ కోసం ఏకంగా 42మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే వీరిలో ప్రభుత్వ ఉద్యోగులే డజను మందికి పైగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఎన్నికల్లో పోటీ చేసేంత డబ్బు ప్రభుత్వ ఉద్యోగులకు ఎక్కడిదనే చర్చ జరిగింది. ఎంపీ టికెట్ కోసం వచ్చిన దరఖాస్తులను ఏఐసీసీ కమిటీ పరిశీలించింది. స్థానికేతరులు కూడా భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. వరంగల్ ఎంపీ సీటును స్థానికేతరులు గెలిచిన చరిత్ర లేకపోవటంతో వారి దరఖాస్తులను కూడా ఆ కమిటీ పక్కన పెట్టినట్టు సమాచారం. ఇక ప్రభుత్వ ఉద్యోగుల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోకుండా, పార్టీ కోసం పని చేస్తున్న 12మందికిపైగా స్థానిక ఆశావహులను కమిటీ గుర్తించింది. వీరిలో గత ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన సింగాపురం ఇందిర, గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన దొమ్మాటి సాంబయ్య, గత అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట సీటు ఆశించిన నమిండ్ల శ్రీనివాస్ పేర్లతో పాటు మరో నలుగురైదుగురి ప్రొఫైల్ కూడా ఏఐసీసీకి టీపీసీసీ పంపించింది. ఒకవేళ ఈ ముగ్గురు కాకుంటే ఈ నలుగురైదుగురిలో ఒక పేరు పరిశీలించాలని కూడా టీపీసీసీ విజ్ఞప్తి చేసినట్టు సమాచారం.

అభిప్రాయ సేకరణ

వరంగల్ ఎంపీ టికెట్ కోసం స్క్రీనింగ్ కమిటీ రెండు రోజులుగా పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీల్లో సునిల్ కనుగోలు బృందంతో పాటు మరో రెండు సర్వే ఏజెన్సీలతో ఫ్లాష్ సర్వేలు నిర్వహించింది. ఈ సర్వేల్లో మొదటిరెండు స్థానాల్లో ఇందిర, సాంబయ్య నిలిచినట్టు సమాచారం. దీంతో ఈ ఇద్దరి విషయమై పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, నియోజకవవర్గ ఇన్‌చార్జ్‌ల నుంచి ఏఐసీసీ ప్రతినిధులు అభిప్రాయ సేకరణ చేసినట్టు తెలుస్తోంది. వరంగల్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, స్టేషన్‌ఘనపూర్ మినహా ఆరు చోట్ల కాం గ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. అలాగే పార్లమెం ట్ ఇన్‌చార్జ్ మంత్రి కొండా సురేఖతో పాటు ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రి పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయాలను ఏఐసీసీ ప్రతినిధు లు సేకరించినట్లుగా సమాచారం. ఆర్థిక, అంగబలం ఉండటంతో పాటు పార్టీకి సేవ చేసిన వారిలో ఎవరికి టికెట్ ఇచ్చిన గెలిపించేందుకు కృషి చేస్తామని మెజారిటీ ఎమ్మె ల్యేలు స్పష్టం చేసినట్టు సమాచారం. సీఎం రేవంత్ కూడా వరంగల్ ఎంపీపై ప్రత్యేక దృష్టి పెట్టారని, పక్కాగా వరంగల్ సీటులో పాగా వేయాలని, గెలిచే అవకాశం ఉన్నవారికే టికెట్ వస్తుందని ఆయన కాంగ్రెస్ నేతలకు చెప్పారని సమాచారం.

ఇందిర, సాంబయ్య మధ్యే పోటాపోటీ

దరఖాస్తు చేసుకున్న వారు భారీగానే ఉన్నా సింగాపురం ఇందిర, దొమ్మాటి సాంబయ్య మధ్యే టికెట్ రేస్ ఉందని తెలుస్తోంది. 2004లో పోలీసు ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చిన సాంబయ్య.. పరకాల టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2009లో వరంగల్ ఎంపీ గా టీడీపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2012లో బీఆర్ఎస్‌లో చేరిన సాంబయ్య.. 2014లో వైసీపీ గూటికి చేరారు. 2018లో రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌లో చేరిన సాంబయ్య.. 2019లో వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి పోటి చేసి ఓటమిపాలయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డితో దొమ్మాటి సాంబయ్యకు సన్నిహిత సంబంధాలు ఉండటమే కాకుండా, 2018లో రేవంత్‌రెడ్డితో పాటు సాంబయ్య కాంగ్రెస్‌లో చేరారు. ఇవన్నీ సాంబయ్యకు కలిసి వచ్చే అవకాశాలుగా పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి.


సింగాపురం ఇందిర


దొమ్మాటి సాంబయ్య

అలాగే సింగపురం ఇందిర తండ్రి దేవదానం 1960లోనే ఎమ్మెల్యేగా పని చేశారు. కాంగ్రెస్ వాదిగా ఉన్న దేవదానం ఇందిరాగాంధీపై ఉన్న అభిమానంతో తన కూతురికి ఇందిర అని పెట్టారు. కాంగ్రెస్‌కు అనుకూల కుటుంబం నుంచి వచ్చిన ఇందిర గత అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నుంచి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆర్థికంగా బలంగా ఉండటంతో పాటు దళిత మహిళగా తనకే ఏఐసీసీ ఎంపీగా అవకాశం ఇస్తుందనే ఆశతో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షితో ఇందిరకు సత్సంబంధాలున్నట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీనికి తోడు మహిళలకు 33శాతం టికెట్లు ఇవ్వాలని పార్టీ చేసిన అంతర్గత తీర్మానం లాంటివి తనకు కలిసి వస్తాయనే ధీమాలో ఇందిర ఉన్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట సీటు ఆశించినా అధిష్ఠానం ఆదేశాల మేరకు త్యాగం చేశానని, తనకే వరంగల్ ఎంపీ సీటు వస్తుందనే నమ్మకంతో నమిండ్ల శ్రీనివాస్ ఉన్నారు. మొత్తానికి వరంగల్ ఎంపీ టికెట్ ఎవరికి వస్తుందో అనే ఉత్కంఠ కాంగ్రెస్ కేడర్‌లో కనిపిస్తోంది.

వార్షిక రుణ బడ్జెట్ 3102.85 కోట్లు

ప్రణాళిక విడుదల చేసిన కలెక్టర్ రిజ్వాన్ బాషా


బడ్జెట్ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ టౌన్, మార్చి 5: జిల్లాకు సంబంధించి 2024-25 వార్షిక రుణ బడ్జెట్ రూ.3102.85 కోట్లుగా నిర్ణయించినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో క్రాప్ రుణాలు, టర్మ్ రుణాలు, ఎంఎస్ఎంఈ తదితర ఇతర రుణాలు కలిపి మొత్తం వార్షిక ప్రణాళిక రూ.3102.85 కోట్లు కాగా ఇందులో రూ.2259.51 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు రుణ లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ ప్లాన్‌లో పెండింగ్ యూనిట్లు, పీఎంఈజీపీ పెండింగ్ యూనిట్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఎంఎస్ఎంఈ, స్వయం సహాయక సంఘాలు, విద్యా, హౌసింగ్, ముద్ర, మెప్మా రుణాలన్నింటిలో మార్చి నెలాఖరులోగా లక్ష్యం సాధించాలన్నారు.

కేంద్ర ప్రభుత్వం కొత్తగా పీఎం విశ్వకర్మ పథకం ద్వారా 18 రకాల చేతి వృత్తుల వారికి ఆర్థిక సాయం అందించి చేయూతనిస్తోందని, దీనికోసం కామన్ సర్వీస్ సెంటర్లలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీధర్, డీఆర్‌డీవో మొగులప్ప, డీఏవో వినోద్‌కుమార్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్..

హైదరాబాద్ నుంచి విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఎంఎం.రిజ్వీ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదుపై పలు సూచనలు చేశారు. మునిసిపాలిటీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించారు. రూ.500కు సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందని వారు తమ రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్, విద్యుత్ మీటర్ నంబర్ వివరాలను ప్రజాపాలన సెంటర్లలో అందజేసి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ వివరాలన్నీ ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్, జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డీపీవో రంగాచారి, డీసీఎస్‌వో రోజారాని తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలపండి

ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పార్టీ ప్రతినిధులను కోరారు. మంగళవారం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల వరకు ఓటర్ల జాబితా ముసాయిదా రూపకల్పన జరుగుతూనే ఉంటుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 7,48,570 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. మరోవైపు గ్రాడ్యుయేట్ ఓట్లు 21,870 నమోదైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్, వివిధ పార్టీల నాయకులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, జోగు ప్రకాశ్, మడిపడిగ చంద్రశేఖర్, ఎగుర్ల విజయభాస్కర్, రావెల రవి, ఎలక్షన్ పర్యవేక్షకులు రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనుల కొలతలు తీసుకుంటున్న ఈజీఎస్ సిబ్బంది

జీతాలేవీ?

- ఉపాధిహామీ ఉద్యోగులకు అందని వేతనాలు
- నాలుగు నెలలుగా పెండింగ్
- నిత్యావసరాలు సైతం కొనలేని దైన్యం
- అప్పులపాలవుతున్న కుటుంబాలు
- ఆదుకోవాలని సర్కారుకు విన్నపం

కొడకండ్ల మార్చి 5: పల్లెల నుంచి పట్టణాలకు వలసలను తగ్గించాలన్న ఉద్దేశంతో 2005లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ప్రారంభించింది. దీని కింద అనేక రకాల పనుల ద్వారా కూలీలకు పని దొరకడమేకాక పల్లెల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటవుతున్నాయి. అయితే గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించడానికి విశేషకృషి చేస్తున్న ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది బతుకులు మాత్రం దుర్భరంగా మారుతున్నాయి. మార్చి నెలతో కలిపి ఇప్పటివరకు 4 నెలల జీతం అందక ఈజీఎస్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి కిరాయి, పిల్లల చదువులకు ఫీజుతో పాటు నిత్యావరాలకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితిని వారు ఎదుర్కొంటున్నారు.

గ్రామీణ అభివృద్ధిలో కీలక పాత్ర..

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో అనేక రకాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రైతువేదికల నిర్మాణం, కల్లాలు, ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, నర్సరీలు, ఫాంపాండ్‌లు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, హరితహారం, ఎవెన్యూ ప్లాంటేషన్, పశువుల షెడ్లు, సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, వంటగదుల నిర్మాణం, ముురుగు కాల్వల, గ్రామీణ క్రీడాప్రాంగణాల నిర్మాణం ఇలా సుమారు 40 రకాలకు పైగా పనులు ఈ పథకంలో కొనసాగుతున్నాయి.

అధికమైన పనిభారం..

ప్రతీ పనిలో కిందిస్థాయి సిబ్బంది నుంచి జిల్లాస్థాయి

మిగతా 8వ పేజీలో...

ఎప్పటికప్పుడు చెల్లించాలి..

- లావూ బాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్



జిల్లాలో నూతన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేశాక ఇప్పటివరకు వాటికి సిబ్బందిని నియమించలేదు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే మాకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్నాము. కానీ ఇప్పటివరకు ఆ ఊసే ఎత్తడం లేదు. అంతేకాకుండా ఈ మార్చితో కలిపి మొత్తం 4 నెలల జీతం రావాల్సి ఉంది. విపరీతమైన పని భారంతో సతమతమవుతున్న మాకు జీతాలు కూడా సమయానికి అందకపోవడంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. కనీస అవసరాలకు కూడా అప్పులు చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా మా వేతన బకాయిలు క్లియర్ చేసి పేస్కేల్ వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫీజు వేస్తుండగా..

విద్యుదాఘాతంతో కాంట్రాక్టు ఉద్యోగి మృతి

అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామస్థుల ఆగ్రహం

లింగాలఘణపురం, మార్చి5: ఎన్‌పీడీసీఎల్ కాంట్రాక్ట్ ఉద్యోగి వంచ మహేందర్‌రెడ్డి(34) విద్యుదాఘాతంతో మంగళవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి గ్రామానికి చెందిన వంచ వినోద-సోమిరెడ్డి కుమారుడు మహేందర్‌రెడ్డి పదేళ్లుగా విద్యుత్‌శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా(కట్టర్) పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వనపర్తి 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ మర్రితండా ఫీడర్ పరిధిలోని ఎస్ఎస్- 74 డీటీ ఆర్(ట్రాన్స్‌ఫార్మర్)తో పాటుగా నేలపోగుల ఫీడర్ పరిధిలోని ఎస్ఎస్-7 డీటీఆర్(ట్రాన్స్‌ఫార్మర్)లకు రెండింటికీ హెచ్‌జీ ఫ్యూజ్‌లు కాలిపోయాయి. వాటిని సరిచేసేందుకు రెండు ఫీడర్‌లకు ఎల్‌సీ(లైన్‌కట్) తీసుకోవాల్సి ఉండగా కేవలం ఎస్ఎస్-7 డీటీఆర్‌కు మాత్రమే ఎల్‌సీ తీసుకొని ఎస్ఎస్- 74కు ఎల్‌సీ తీసుకోకుండానే హెచ్‌జీ ఫ్యూజ్ వేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఎ క్కాడు. దీంతో విద్యుదాఘాతానికి గురైన మహేందర్‌రెడ్డి ఒళ్లంతా కాలిపో యి కరెంట్ స్తంభం నుంచి కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు.


మృతదేహంతో వనపర్తి వద్ద రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

జాతీయ రహదారిపై గ్రామస్థుల రాస్తారోకో..

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కట్టర్ మహేందర్‌రెడ్డి మృతి చెందాడని, అతడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక రైతులు, గ్రామస్థులు సుమారు గంట పాటు జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. డీటీఆర్‌లకు ఏబీ స్విచ్‌లు లేవనే విషయం అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదని, ఏబీస్విచ్ ఆఫ్ చేసుకుంటే ఈ ప్రమాదం జరగకపోయే దని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేంతవర కు రాస్తారోకో విరమించేది లేదని మొండికేయడంతో జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌యాదవ్ వారికి నచ్చజెప్పి రాస్తారోకో విరమింపజేశారు. జనగామ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదసంఘటనపై విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు లైన్‌మెన్ ద్వారా రూ. 1 లక్ష, జనశ్రీ కాంట్రాక్ట్ ఏజెన్సీ ద్వారా మరో రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి వృద్ధ తల్లిదండ్రులతో పాటు ఆరుమాసాల గర్భవతి అయిన భార్య దివ్య ఉన్నారు. ఈ ఘటనపై స్థానిక లైన్‌మన్ నవీన్‌రెడ్డి, జనశ్రీ ఏజెన్సీ కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డిపై మహేందర్‌రెడ్డి సోదరి వంచ స్వర్ణలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యుత్‌ప్రమాదం జరగడానికి వీరిద్దరి నిర్లక్ష్యమే కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై రాజు ఇద్దరిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సంఘటనా స్థలంలో మహేందర్‌రెడ్డి మృతదేహం, ఇన్‌సెట్‌లో (ఫైల్ ఫొటో)

బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశాలు

సోమేశ్వరాలయంలో ఏర్పాట్ల పరిశీలన

పాలకుర్తి, మార్చి 5: శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈ నెల 7 నుంచి 11 వరకు జరిగే బ్రహ్మోత్సవాలను పగడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగాణంలో జరుగుతున్న జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ 8న స్వామి వారి కల్యాణోత్సవం సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలనానరు. ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేయాలని, వాహనాలు పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయాలని, భక్తులకు తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో డీఎస్ వెంకన్న, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై సాయి ప్రసన్నకుమార్, ఏఈలు రణధీర్, శ్రీనివాస్, పీఆర్‌డీఈ చారి, ఈవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీవో రాములు, డాక్టర్ రవిరాథోడ్ పాల్గొన్నారు.


పాలకుర్తిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

బోరుబావులకు అందని పరిహారం

హైకోర్టును ఆశ్రయించిన బాధితుడు

న్యాయస్థానం ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 5: జాతీయ రహదారి విస్తరణలో తను ఇంటి స్థలాన్ని కోల్పోయాడు. ఇందుకు నేషనల్ హైవే అధికారులు పరిహారం అందించారు. కాని అదే స్థలంలో రెండు బోరుబావులు ఉన్నాయి. వాటికి పరిహారం అందలేదు. దీంతో బాధితుడు రోడ్డు పనులను అడ్డుకున్నాడు. అయినా అధికారులు పట్టించుకోలేదు. చివరికి కోర్టును ఆశ్రయించాడు. ఇపుడు న్యాయస్థానం ఆదేశాలతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్ గ్రామానికి చెందిన ఎమ్డీ తాజుద్దీన్ ఇల్లు రహదారి పక్కనే ఉంది. రోడ్డు విస్తరణలో ఇంటిముందు ప్రహరీతో పాటు కొంత స్థలాన్ని కోల్పోయాడు. దీనికి ఎన్‌హెచ్ అధికారులు పరిహారం అందించారు. అయితే అదేస్థలంలో తాగునీటి కోసం వేసిన రెండు బోర్లు ఉన్నాయి. వాటికి మాత్రం పరిహారం ఇవ్వలేదు. మిగతా అందరికీ ఇచ్చి తనకు మాత్రమే ఇవ్వకపోవడంతో 2018లో తన ఇంటిముందు జరుగుతున్న సర్వీసురోడ్డు పనులను తాజుద్దీన్ అడ్డుకున్నాడు. నష్టపరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేపట్టాలని పట్టుబట్టాడు. దీంతో ఎన్‌హెచ్ సిబ్బంది రెండు బోర్ల మధ్య గల సుమారు 50 అడుగుల మేర సర్వీసు రోడ్డు పైన తారు వేయకుండానే వదిలేశారు. మిగతా అంతా పూర్తి చేశారు. దీంతో తాజుద్దీన్ ఆర్డీవో, ఎన్‌హెచ్ అధికారులను పలుమార్లు కలిసి వినతి పత్రాలు అందించినా ఫలితం లభించలేదు. చివరికి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో గత నెల 16న ఆర్డీవోకు, ఎన్‌హెచ్ పీడీకి న్యాయస్థానం షోకాజ్‌నోటీసులు పంపించింది. గత నెల 23న హైకోర్టులో హాజరు కావాలని ఆదేశించింది. దీన్ని వారు బేఖాతరు చేశారు. దీంతో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ 2013 భూ సేకరణ చట్టాన్ని అనుసరించి బాధితుడికి నష్టపరిహారం చెల్లించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆయన ఆర్డీవో, ఎన్‌హెచ్ పీడీని తదుపరి చర్యలకు ఆదేశించారు. ఈ విషయమై తహసీల్దార్ వెంకటేశ్వర్లును మంగళవారం వివరణ కోరగా పూర్తి విచారణ జరిపి ఒకటి రెండు రోజుల్లో ఆర్డీవోకు నివేదిక ఇస్తానని తెలిపారు.


బోరు బావుల వద్ద రోడ్డు పోయకుండా వదిలేసిన దృశ్యం

CHANGE OF NAME

I, the undersigned **RAMINI RAVINDER,** my spouse name **RAMINI GANGA RANI** previously called **RAMINI RANI** (Old Name), and residing at H.No. 2-4-71/72, Nehru Park, Road, Jangaon Town and Mandal, Jangaon District, Telangana State and solemnly declare that Ramini Rani & Ramini Ganga Rani related to same person.

'లహరి' బస్సుల్లో సుఖవంతమైన ప్రయాణం

ప్రయాణికులకు సౌకర్యంగా వసతులు



లహరి బస్సుల్లో సౌకర్యాలు

సుబేదారి, మార్చి 5: రాష్ట్ర ప్రభుత్వం వరంగల్-1 డిపోకు నాలుగు లహరి సెమీ స్లీపర్ బస్సులను కేటాయించింది. గత నెల 3వ తేదీన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ బస్సులను హనుమకొండ బస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ బస్సులను ఆర్టీసీ అధికారులు హనుమకొండ నుంచి బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఇందులో స్లీపర్, సీటర్ సౌకర్యం ఉంది. ప్రయాణికులకు ఈ బస్సుల్లో 20 బెడ్స్, 22 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 20 మంది ప్రయాణికులు పడుకునేందుకు వీలుగా, 22 మంది ప్రయాణికులు కూర్చుని వెళ్లేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు ఈ బస్సుల్లో ఉన్నాయి. ఆర్టీసీ అధికారులు రోజు రెండు బస్సులు హనుమకొండ నుంచి బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఈ బస్సు రోజు సాయంత్రం 4:30 గంటలకు ఒక బస్సు, 6:30 గంటలకు మరో బస్సును బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఈ బస్సుల్లో మంటలు, ఇంజన్‌లో పొగలు వస్తే సెన్సార్‌ల ద్వారా గుర్తించవచ్చు. బటన్ నొక్కితే ఈ బస్సు ప్రయాణించే దగ్గరి డిపోలకు ఇన్ఫర్మేషన్ వెలుతుంది. అప్పుడు అధికారులు అప్రమత్తమై ఎలాంటి ప్రమాదం జరగకుండా కాపాడుకోవచ్చు.

ప్రయాణికులకు సౌకర్యంగా బెడ్స్

హనుమకొండ నుంచి బెంగళూరుకు ప్రయాణించే ప్రయాణికులలో ఎక్కువ మంది ఉద్యోగులు ఉంటారు. గతంలో ఈ బస్సులో లేనప్పుడు వేరే ఆర్టీసీ బస్సులలో కూర్చుని ప్రయాణించినప్పుడు ప్రయాణికులు అలసిపోయి తెల్లారి ఉద్యోగానికి వెళ్లడానికి ఇబ్బందిగా ఉండేది. లహరి బస్సులలో బెడ్స్ సౌకర్యం ఉండడంతో పడుకుని ప్రయాణించడం వలన ఎలాంటి ఇబ్బంది, అలసట ఉండదు. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి కేయూలో రూబీజెస్ట్

కేయూ క్యాంపస్, మార్చి 5: కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 6, 7 తేదీల్లో రూబీజెస్ట్-24 టెక్నికల్ ఫెస్ట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం ప్రారంభం కానున్న రెండు రోజుల సంబురాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌లు హాజరుకానున్నారు. కేయూ ఆడిటోరియంలో కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అధ్యక్షతన బుధవారం ఉదయం 10 గంటలకు సంబురాలు వైభవంగా షురూ అవుతాయి. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో టెక్నికల్ సెషన్లు, చర్చలు, సెమినార్‌హాల్‌లో ఆఖరు రోజున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కాగా మంగళవారం కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందంలు రూబీజెస్ట్-24 పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే మంగళవారం సాయంత్రం రూబీజెస్ట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు.

ఆటో డ్రైవర్లకు అండగా నిలవాలి

వడ్డెపల్లి, మార్చి 5: ఆటోడ్రైవర్లకు పోలీసు శాఖ అండగా నిలవాలని వరంగల్ ఉమ్మడి జిల్లా ఆటో డ్రైవర్స్ జేఏసీ చైర్మన్ ఎమ్డీ అంకూషా వలి, జిల్లా గౌరవ అధ్యక్షుడు చిర్ర రమేష్ గౌడ్ తదితరులు హనుమకొండ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణను కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హనుమకొండ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణను వారు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఏసీపీని కలిసిన వారిలో ఆటో డ్రైవర్స్ జేఏసీ వైస్ చైర్మన్ పసుల యాదగిరి, కన్వీనర్లు దేవర మల్లేష్, బండి లింగయ్య, ఓరుగంటి సదానందం ఉన్నారు.

గ్రంథాలయాల్లో ఉద్యోగుల్లేరు..

● అన్ని పోస్టులు ఖాళీ ● ఇన్‌చార్జిలే దిక్కు ● 30 ఏళ్ల నుంచి నియామకాల్లేవు ● ఉన్న ఉద్యోగులపై పని భారం
● సిబ్బంది లేక ఇబ్బందులు ● ఉమ్మడి జిల్లాలో దీనస్థితిలో గ్రంథాలయాలు ● నోటిఫికేషన్లతో లైబ్రరీలకు నిరుద్యోగులు పరుగు


జనగామ జిల్లా బచ్చన్నపేటలోని శాఖా గ్రంథాలయం


ములుగు జిల్లా కేంద్ర గ్రంథాలయం

హనుమకొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : యువత సర్వతోముఖాభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. విజ్ఞానానికి, విరామకాల సద్వినియోగానికి, విశేషజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు మానవ జీవితంలో విడదీయరాని సంబంధం కలిగి ఉంటున్నాయి. ఆధునిక యుగంలో సౌకర్యాలెన్ని పెరిగినా విద్యార్థులకు, ఉద్యోగార్థులకు, నిరుద్యోగులకు విజ్ఞానార్జనకు గ్రంథాలయాలే ప్రధాన ఆధారాలు. విద్యార్థులను విజ్ఞానవంతులుగా, ఉద్యోగార్థులను ఉద్యోగస్తులుగా చేయడంలో కీలక భూమిక పోషించే గ్రంథాలయాలు ఉద్యోగుల కొరతతో కూనారిల్లుతున్నాయి. ఉద్యోగవేటలో ఉన్న నిరుద్యోగులకు చేయూతనిస్తున్న గ్రంథాలయాలే చాలినంత సిబ్బంది లేక చచ్చుపడి పోతున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్లను జారీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లోని ఖాళీలను పట్టించుకోవడం లేదు.

ఉద్యోగార్థుల పరుగులు

గ్రంథాలయాలు విద్యార్థులు, ఉద్యోగార్థుల పాలిట కల్పతరువుగా నిలుస్తున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో మెగా డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలు నిర్వహిస్తుండడంతో యువత పఠనాలయాలకు పరుగులు తీస్తున్నారు. దీంతో కొన్ని రోజులుగా గ్రంథాలయాలు సందడిగా కనినిస్తున్నాయి. కానీ అక్కడ శాశ్వత సిబ్బంది లేక వెక్కిరిస్తున్న ఖాళీలతో వాటి పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. దీంతో నిర్వహణ కొరవడి పాఠకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

30 ఏళ్లుగా నియామకాల్లేవు

1995లో శాఖాపరంగా ఉద్యోగాలు భర్తీ చేశారు. ఆ తర్వాత కాలంలో గ్రంథాలయాల్లో ఉద్యోగుల నియామకాలు జరగలేదు. ఈమధ్యకాలంలో అనేక మంది రిటైర్ అయ్యారు. గ్రంథపాలకులు మొదలుకొని స్వీపర్ల వరకు అనేక ఖాళీలు ఏర్పడ్డాయి. అయినా ఈ మూడు దశాబ్దాలకాలంలో వచ్చిన ప్రభుత్వాలు ఏవీ వాటిని భర్తీ చేయలేదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతోనే ప్రభుత్వం నెట్టుకువస్తున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగులు వేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలోనే ఉన్నారు. సిబ్బంది కొరతవల్ల వారిపై అదనపు పనిభారం పడుతోంది. కొన్ని శాఖా గ్రంథాలయాల్లో స్వీపర్లే ఇన్‌చార్జి గ్రంథపాలకులుగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల ఒకే ఉద్యోగి రెండు, మూడు గ్రంథాలయాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. ఒక్కోదానికి రెండు లేదా మూడు రోజులు కేటాయిస్తున్నాడు. గ్రంథ పాలకులు లేని రోజుల్లో అటెండరు లేదా స్వీపర్లు గ్రంథాలయాన్ని తెరిచి దినపత్రికలను మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. బుక్ సెక్షన్లు మూసే ఉంటున్నాయి. సిబ్బంది కొరత వల్ల చాలా చోట్ల గ్రంథాలయాలను ఎప్పుడు తెరుస్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న తమకు ఈ పరిస్థితి ఇబ్బందిగా ఉందని ఉద్యోగార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని పాలకులు

గ్రంథాలయాల వ్యవస్థను ఒక ప్రభుత్వ శాఖగా కాక దానినొక సంస్థగా భావిస్తుండడంవల్ల పట్టింపు లేకుండా పోయింది. గ్రంథాలయ సంస్థలు రాజకీయ పదవులకు పునరావాస కేంద్రాలుగా మాత్రమే పనికొస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు అనుకూలమైనవారికి నామినేటెడ్ పదవుల పందారంలో భాగంగా చైర్మన్లను నియమించడంలో ఉన్న శ్రద్ధ.. వాటి నిర్వహణలో కీలక పాత్ర పోషించే సిబ్బందిని నియమించడంలో చూపడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లకాలంలో వాటి గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. చైర్మన్లుగా నియమితులైన వారు సిబ్బంది కొరత వల్ల సైతం గ్రంథాలయాల నిర్వహణను మెరుగుపరచలేకపోతున్నారు.

కనీస వసతులు కరవు

జిల్లా కేంద్రాల్లోని గ్రంథాలయాలకు అరకొర నిధులు ఇవ్వడం మినహా వాటి అభివృద్ధికి పెద్దగా చర్యలు తీసుకోలేదు. మున్సిపాలిటీల నుంచి వచ్చే గ్రంథాల సెస్సే వాటికి ఆర్థిక వనరు. అవి చెల్లించే నిధులతోనే ఏదో విధంగా నెట్టుకువస్తున్నాయి. గ్రామాల్లో పంచాయతీల నుంచి వచ్చే లైబ్రరీ సెస్సు చాలా తక్కువ. చాలా పంచాయతీలు వీటిని చెల్లించడం లేదు. దీంతో గ్రామాల్లో శాఖా గ్రంథాలయాల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. శాఖా గ్రంథాలయాల్లో చాలా వాటికి స్వంత భవనాలు లేవు. అన్నీ అద్దె ఇళ్లలో అరకొర వస్తుల నడుమ నడుస్తున్నాయి. పాఠకులు చదువుకోవడానికి కనీస వసతులు మచ్చుకైనా కానరావు. చాలినన్నీ కుర్చీలు, బెంచీలు లేవు. ఇక పుస్తకాల అందుబాటు అంతంత మాత్రమే..

ఉమ్మడి వరంగల్‌లోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లిలలో ఆరు జిల్లా గ్రంథాలయాలు, 66 శాఖా గ్రంథాలయాలు, ఒక ప్రాంతీయ గ్రంథాలయం ఉన్నాయి. వరంగల్ పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా ఉన్న ప్రాంతీయ గ్రంథాలయం ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక లైబ్రరీ. దీనికి సొంత భవనం ఉంది. ఇందులో చాలినంత మంది ఉద్యోగులున్నారు. వీరికి ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లిస్తుంది. మిగతా గ్రంథాలయాల పరిస్థితి వేరు. ఇవన్నీ గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఇందులో పనిచేసే వారంతా గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులు. మున్సిపాలిటీలు గ్రంథాలయ సెస్సుద్వారా వచ్చే ఆదాయం నుంచే వీరికి వేతనాలు.

20 ఖాళీలు

హనుమకొండ జిల్లాకు సంబంధించి 33 శాంక్షన్ పోస్టులకుగాను ప్రస్తుతం 13మంది మాత్రమే ఉన్నారు. రెగ్యులర్ లైబ్రేరియన్లు అయిదుగురు మాత్రమే ఉన్నారు. ముగ్గురు ఔట్‌సోర్సింగ్ విధానం కింద పని చేస్తున్నారు. కింది స్థాయి సిబ్బంది అంతా పార్ట్‌టైమర్సే. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సమీపంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉమ్మడి జిల్లా అంతటికి అతిపెద్ద లైబ్రరీ. దీనితోపాటు 11 శాఖా గ్రంథాలయాలు, అయిదు గ్రామ గ్రంథాలయాలు, ఒక పిల్లల లైబ్రరీ ఉన్నాయి. ఉద్యోగుల కొరతవల్ల ఒక్కొక్కరు రెండు అంతకన్నా ఎక్కువ గ్రంథాలయాలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఇద్దరు గ్రేడ్ 2 లైబ్రేరియన్లకు బదులు ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. మరొకరిని డిప్యూటేషన్‌పై తీసుకున్నారు. ఇద్దరు వాచ్‌మెన్లు ఉండాల్సి ఉండగా, ఒక్కరు కూడా లేరు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటించడంతో ఉద్యోగార్థుల కోసం ఈ గ్రంథాలయం పని వేళలను పెంచారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పని చేస్తోంది. చాలినంత మంది సిబ్బంది లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక జిల్లా గ్రంథాలయంతో పాటు 11 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. ఈ 11 లైబ్రరీల్లో రెండింటికే పూర్తికాలపు లైబ్రేరియన్లు ఉన్నారు. మిగతా ఎనిమిదింటిని పంచాయతీ సిబ్బందితో నెట్టుకువస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో జిల్లా లైబ్రరీతో పాటు 12 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. శాఖా లైబ్రరీలు పార్ట్‌టైమ్ ఉద్యోగులతో నడుస్తున్నాయి. ములుగు జిల్లా పరిధిలో తొమ్మిది లైబ్రరీలు ఉన్నాయి. ములుగులో జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంటకాపురం (నూగూరు)లో శాఖా గ్రంథాలయాలున్నాయి. ఈ తొమ్మిది లైబ్రరీలలో ఎనిమిదింటికి గ్రంథపాలకులు లేరు. కొత్త నియామకాలు లేకపోవడంతో వీటి బాధ్యతలు ఇన్‌చార్జిలకు అప్పగించారు. ములుగు సెంట్రల్ లైబ్రరీలో ఒక గ్రేడ్ 1, ఇద్దరు గ్రేడ్ 2, లైబ్రేరియన్లు, ఇద్దరు అటెండర్లు, వాచ్‌మెన్, స్వీపర్, బుక్‌కీపర్, బైండింగ్ వర్కర్, జూనియర్, సీనియర్, రికార్డు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జనగామలో ఒక జిల్లా గ్రంథాలయంతో పాటు పది శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. శాఖ లైబ్రరీల్లో వేటికి పూర్తికాలపు లైబ్రేరియన్లు లేరు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నడిపిస్తున్నారు.

హామీలను దాటవేసే ప్రయత్నంలో కాంగ్రెస్

తిరుమలలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

తిరుమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ హామీలిచ్చిందని, కానీ ఇచ్చిన ప్రతి హామీని దాటవేసే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శించారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు.పదేళ్ల పాటు రాష్ట్రంలో బ్రహ్మాండమైన పరిపాలన అందించినప్పటికీ ఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోయిందన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను రెచ్చగొట్టేలా పరిపాలన చేస్తున్నారన్నారు.ఇప్పటికే రాష్ట్రంలో సాగు, తాగునీటి కొరతతో పాటు విద్యుత్ కొరత కూడా మొదలైందన్నారు. అధికార పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకొచ్చేందుకు పోరాడే శక్తిని కేసీఆర్‌కు ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు.ప్రజలపక్షాన పోరాడే నాయకులను మాత్రమే ఎంపీలుగా ఎన్నుకోవాలని తెలుగు రాష్ట్రాల ప్రజలను కోరారు.

గద్దర్ కళాక్షేత్రాన్ని నిర్మించాలి

వడ్డెపల్లి, మార్చి 5: ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ పేరుతో హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్‌లో గద్దర్ కళాక్షేత్రాన్ని నిర్మించాలని గద్దర్ ఆలోచన ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ మంచాల ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్దర్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గద్దర్ విగ్రహాన్ని అన్ని జిల్లాల కేంద్రాలలో ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో గద్దర్ ఆలోచన వేదిక రాష్ట్ర కో కన్వీనర్ ఐత అనిల్, రాష్ట్ర కో ఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

ఇస్రో పిలుస్తోంది..

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహనే లక్ష్యం ● భావి శాస్త్రవేత్తలకు వేదిక.. యువికా.. ● 9వ తరగతి విద్యార్థులకు దరఖాస్తుల ఆహ్వానం
● ఈనెల 20 వరకు అవకాశం ● ఈనెల 28, ఏప్రిల్ 4న ఎంపిక జాబితా ● ఎంపికైన వారికి మే 13 నుంచి శిక్షణ

జఫర్‌గఢ్, మార్చి 5 : పిల్లల ఆలోచనలకు మెరుగులు దిద్దితే భావి తరానికి శాస్త్రవేత్తలుగా మార్చుకోవచ్చు. ఈ విషయాన్ని గుర్తించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో).. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అంతరిక్షపరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఓవినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు అంతరిక్ష శాస్త్రం, అనువర్తనాలపై ప్రాథమికజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా యంగ్ సైంటిస్ట్ పేరుతో యువ విజ్ఞాన కార్యక్రమాన్ని (యువికా) 2019 నుంచి నిర్వహిస్తోంది. బాల్యదశ నుంచే శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగ్, గణితం ఆధారిత పరిశోధన కెరీర్‌లో కొనసాగే వారికి ఇది వేదికగా నిలుస్తోంది. 2024 సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తు చేసుకునేందుకు 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు అర్హులు. ప్రస్తుతం దరఖాస్తుప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. అర్హత, ఆసక్తి గల విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు కోరుతున్నారు.

ఈనెల 20 వరకు దరఖాస్తుకు అవకాశం

ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా www.isro.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే విద్యార్థి 2024, జనవరి 1 నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతూ ఉండాలి. విద్యార్థులు మొదట వారి ఈ-మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకున్న రెండు రోజుల తరువాత ఇస్రో ఏర్పాటు చేసే ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. ఈ ప్రక్రియ పూర్తయిన గంట తరువాత యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి ధ్రువ పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఈనెల 28న మొదటి ఎంపిక జాబితా, ఏప్రిల్ 4న రెండో ఎంపిక జాబితాలను ప్రకటిస్తారు. ఎంపికైన వారు మే 12న ఇస్రో సూచించిన కేంద్రాలవద్ద రిపోర్టు చేయాలి.

దరఖాస్తుకు అర్హతలు - వెయిటేజీ కేటాయింపు

దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 8వ తరగతిలో 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. 9వ తరగతి విద్యార్థులుసహ పాఠ్యాంశాలపై పట్టు కలిగి ఉండాలి. స్కౌట్స్ అండ్ గేమ్స్, ఎన్ఎస్ఎస్‌లో పాల్గొంటే ఐదు మార్కులు, గ్రామీణ ప్రాంత పాఠశాల విద్యార్థికి మరో 15 శాతం అదనపు అర్హత కల్పిస్తారు. ఆన్‌లైన్ క్విజ్ ప్రతిభ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొన్న వారికి 10 శాతం చొప్పున వెయిటేజీ కల్పిస్తారు.

శాస్త్ర, సాంకేతికంపై శిక్షణ

యువ విజ్ఞాన కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు శాస్త్ర, సాంకేతికం వంటి అంశాలపై శిక్షణ ఇస్తారు. మే 13 నుంచి 25వ తేదీ వరకు ఇస్రోకు సంబంధించి దేశంలోని యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్-బెంగుళూరు, స్పేస్ అప్లికేషన్స్‌సెంటర్ -అహ్మదాబాద్, విక్రమ్ సారాబాయ్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ - తిరువనంతపురం, నార్త్ ఈస్ట్ అప్లికేషన్ సెంటర్ - షిల్లాంగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - డెహ్రాడూన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - హైదరాబాద్, నితీష్‌ధావన్ స్పేస్ సెంటర్ - శ్రీహరికోట ఈ ఏడు కేంద్రాల్లో శిబిరాలను నిర్వహించి శిక్షణ ఇస్తారు. రెసిడెన్షియల్ పద్ధతిలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రయోగాత్మక ప్రదర్శన, ల్యాబ్ సందర్శన, నిపుణులతో ప్రాక్టికల్స్, ఫీడ్‌బ్యాక్ సెషన్‌లు, ప్రముఖ శాస్త్రవేత్తల అనుభవాలు, చర్చ కార్యక్రమాలు వంటివి నిర్వహించడంతో పాటు అంతరిక్ష విజ్ఞానం, రాకెట్ ప్రయోగాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పిస్తారు. కాగా, ఎంపికైన విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరికి లేదా గైడ్ ఉపాధ్యాయుడికి ప్రయాణ ఖర్చులు చెల్లింపుతో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను ఇస్రో కల్పిస్తుంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : పి.రఘునందన్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, జనగామ



ఆసక్తి గల 9వ తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో శాస్త్రీయ సాంకేతిక అవగాహన, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఈ శిక్షణ అవగాహన పెంచుతుంది. తద్వారా విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుంది. విద్యార్థులు తమ ప్రతిభను చూపేందుకు ఈ కార్యక్రమం చక్కటి వేదిక లాంటిది. జిల్లాలోని తొమ్మిదో తరగతి విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి.

హనుమకొండ మత్స్యశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్ కుమార్ యాదవ్ తనపై వేధింపులకు పాల్పడుతున్నారని, కులంపేరుతో దూషించటంతోపాటు అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఫిషరీస్ అసిస్టెంట్ పి. మేఘన ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. ఈమేరకు ఫిర్యాదు కాపీని మంగళవారం మీడియాకు విడుదలచేశారు. హనుమకొండ జిల్లా కార్యాలయం నుంచి భీమారం ఫిష్ ఫామ్‌కు తనను బదిలీచేసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఫిష్ ఫామ్‌లో ఒంటరి మహిళకు విధులు వేసి ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఐఎఫ్‌టీసీ, ఐనవోలు మండల బాధ్యతల నుంచి కూడా అకారణంగా తప్పించారని తెలిపారు. సిబ్బంది ఎదుట తనను కులం పేరుతో దూషించటంతోపాటు అసభ్యకరమైన వాట్సప్ మెసేజ్‌లు పెడుతున్నారని, పరుష పదజాలంతో మాట్లాడుతున్న నరేష్ కుమార్ నాయుడిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మేఘన విజ్ఞప్తిచేశారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

హనుమకొండ క్రైం, మార్చి 5: సుబేదారి పీఎస్ పరిధిలోని గాయత్రి కాలనీలో ఏడుగురు పేకాటరాయుళ్లను వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.15వేల నగదుతో పాటు 2 ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. సీఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలోని గాయత్రికాలనీలో కొద్ది రోజులుగా ఒక ఇంట్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్టు పక్కా సమాచారం అందింది. తమ సిబ్బంది మూకుమ్మడిగా దాడి చేసి 7 గురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి రూ.15వేల నగదు బైక్స్, సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. జూదరులను సుబేదారి పోలీసులకు అప్పగించి గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

భీమునిపాదం వద్ద అరుదైన పక్షులు

కనువిందు చేస్తున్న ఇండియన్ పార్యడైజ్ ఫ్లైక్యాచర్, మెటల్ ఉడ్ ఓవల్ (గుడ్లగూబ), జంగిల్ ఓవ్‌లెట్ పక్షులు


ఇండియన్ ప్యారడైజ్ ఫ్లై క్యాచర్

మహబూబాబాద్ జిల్లా భీమునిపాదం జలపాతం వద్ద అరుదైన పక్షులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి వలస వచ్చిన పక్షులు ఇక్కడ చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ప్రకృతి అందాలకు ప్రతీక అయిన భీమునిపాదం వద్ద అనేక రకాల పక్షులు ఆవాసం ఏర్పరచుకోవడం కనిపిస్తోంది. వాటిల్లో ఒకటి ఇండియన్ ప్యారడైజ్ ఫ్లై క్యాచర్. ఈ వింత పక్షి మెడ నల్లగా ఉండి, మిగతా శరీర భాగం తెల్లగా ఉంటుంది. తలపై అదే నల్లరంగులో జుట్టు ఉంటుంది. దీని తోకభాగం తెల్లని ఈకెలతో చాలా పొడవుగా ఉంటుంది. ఈ పక్షికి ఈ తోకే ఆకర్శణీయం. ఇక్కడ దర్శనమిస్తున్న మరో పక్షి గుడ్లగూబ. గుడ్లగూబలు సాధారణంగా అడవుల్లో చెట్లకొమ్మలపై ఉంటాయి. సాధారణంగా కనిపించే గుడ్లగూబ కన్నా భీమునిపాదం వద్ద దర్శనమిస్తున్న గుడ్లగూబ పక్షి భిన్నంగా ఉంది. దీనిని మెటల్డ్ వుడ్ ఏవెల్. దీని ఈకలు అచ్చం చెట్టు బెరడు రంగులో ఉంటాయి. అందువల్ల చెట్లపై ఉన్నప్పుడు ఆ చెట్టుబెరడు రంగుతో కలిసిపోయి గుర్తించడం కష్టంగా ఉంటుంది. అందుకే దీనికి లోహపురంగుతో కూడి చెట్టుబెరడు గుడ్లగూబగా పేరువచ్చింది, దీని పిల్లలు బూడిద రంగులో ఉంటాయి. పెరిగిన తర్వాత రంగుమారుతాయి. ఇక్కడే మరో రకం గుడ్లగూబ కూడా సందర్శకులకు కనువిందు చేస్తుంది. ఇది అడవి గుడ్లగూబ. సాధారణంగా అడవిలో మనకు ఎక్కువగా కనిపించే పక్షి ఇదే. దీనిని జంగిల్ ఓవ్‌లేట్ అని పిలుస్తారు. ఇదేకాకుండా అనేక ఇతర జాతి పక్షులను కూడా ఇక్కడ చూడవచ్చు.


జంగిల్ ఓవ్‌లెట్


మెటల్ వుడ్ ఔవెల్

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

వేడుకలకు సిద్ధమైన సిద్ధులగుట్ట

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బచ్చన్నపేట, మార్చి 5: ప్రముఖ శైవక్షేత్రమైన కొడవటూరు సిద్ధేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ఈ నెల 6 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 9 వరకు నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా కొనసాగుతాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని 8న రాత్రి జరిగే కల్యాణాన్ని వీక్షించేందుకు వేలాది మంది భక్తులు వస్తారు. వారికి ఎలాంటి లోటు రాకుండా ఈవో చిందం వంశీ చర్యలు చేపట్టారు. శాశ్వత దాతల సంఖ్య పెంచేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు. కల్యాణోత్సవాలకు హాజరు కావాలంటూ పలువురు ప్రముఖులకు అధికారులు ఆహ్వాన పత్రికలు అందించారు. పూజల్లో వేద పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సవాల్లో పాల్గొంటారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 5: సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకులాల్లో 6,7,8,9 తరగతుల్లో అందుబాటులో ఉన్న బ్యాక్ లాగ్ ఖాళీల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్టేషన్ ఘన్‌పూర్ సంక్షేమ గురుకులం ప్రిన్సిపాల్ కాళహస్తి తెలిపారు. వీటితో పాటు అలుగునూరు, కరీంనగర్ జిల్లా, గౌలిదొడ్డి రంగారెడ్డి జిల్లా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కాలేజీలలో 9వ తరగతిలో మాత్రమే రెగ్యులర్ ప్రవేశాలు కోరుతున్నారని చెప్పారు. అలాగే పరిగి ఖమ్మం కాలేజీలో 8వ తరగతిలో మాత్రమే ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 23 చివరి తేదీ అన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

జనగామ కల్చరల్, మార్చి 5: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన పరీక్షలో విద్యార్థులకు సెట్-సి ప్రశ్నాపత్రం అందించారు. 4380 మంది విద్యార్థులకు గాను 97 మంది గైర్హాజరు కాగా 4283 మంది హాజరైనట్లు డీఐఈవో బైరి శ్రీనివాస్ తెలిపారు. పరీక్షల సందర్భంగా ఆయన జనగామ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రెస్టన్, ఎస్ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల, తేజస్వి జూనియర్ కళాశాలను సందర్శించారు. డెక్ సభ్యులు నర్మెట, ఫ్లయింగ్ స్క్వాడ్ దేవరుప్పుల, కొడకండ్ల పరీక్షా కేంద్రాలను సందర్శించినట్లు అధికారులు తెలిపారు. కాగా జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ వొకేషనల్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రం లో ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైనట్లు డీఐఈవో తెలిపారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

రఘునాథపల్లి, మార్చి 5: ఖిలాషాపూర్ సబ్‌స్టేషన్‌లో ఈ నెల 6న వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏఈ రవిందర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక వరంగల్ ఇన్‌చార్జి, చైర్మన్ కె.తిరుమల రావు హాజరవుతారని ఆయన వివరించారు.

ఎమ్మెల్యేలకు ఆహ్వానం



శివ కల్యాణానికి రావాలంటూ ఎమ్మెల్యే కడియంను ఆహ్వానిస్తున్న నాయకులు



సిద్ధులగుట్టకు రావాలంటూ ఎమ్మెల్యే పల్లాను ఆహ్వానిస్తున్న అధికారులు


స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 5: శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 7న స్టేషన్‌ఘన్‌పూర్ పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఆహ్వానించారు. మంగళవారం ఉత్సవ కమిటీ నాయకులు ఆహ్వాన పత్రాన్ని ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చింతకుంట్ల నరేందర్ రెడ్డి, ఎంపీటీసీ నర్సింహులు, జి.రమేశ్, పి.రమేశ్, ఎన్.సుధాకర్, పూజారి టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: కొడవటూరు సిద్దేశ్వరాలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి మంగళవారం ఆహ్వాన పత్రికలను అందించారు. ఈ నెల 6 నుండి 9 వరకు నాలుగు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ చల్లా రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



జనగామలో రైతులకు ఆత్మ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

- రెండేళ్లుగా నిలిచిన పథకం
- అవగాహన కల్పించని వ్యవసాయ శాఖ
- అన్నదాతలకు అందని సాంకేతిక పరిజ్ఞానం
- నూతన ప్రభుత్వంపై రైతుల ఆశలు



అటకెక్కిన ఆత్మ

ATMA

నర్మెట, మార్చి 5: వ్యవసాయరంగంలో సమగ్ర అభివృద్ధి సాధించడం, అన్నదాతకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు వారికి సూచనలు, సలహాలు అందించాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) పథకం నిర్వీర్యమవుతోంది. ఆత్మ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అధికారులు రైతులను చైతన్యవంతం చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రదర్శనలు ఏర్పాటు చేయాలి. కానీ అవి ఎక్కడా మచ్చుకైనా కానరావడం లేదు. నిధుల కేటాయింపు లేక రైతులకు సాంకేతిక అందడం లేదు. నిధుల కొరతతో ఆత్మ పథకం ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలు నిలిచిపోయాయి. అసలు 'ఆత్మ' అంటే ఏమిటి? దాని కార్యాలయం ఎక్కడ ఉంది? దానిలో ఎంతమంది పనిచేస్తారు? వారి ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి? అనేదానిపై అనేకమంది రైతులకు పూర్తి స్థాయి అవగాహన లేదు. ఈ విషయంలో ఆత్మ కమిటీ విఫలమైందనే ఆరోపణలు వస్తున్నాయి.

'ఆత్మ' విధులు

జిల్లాలో సుమారు 1.96 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. 1.15 లక్షల మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా పత్తి, వరి, మొక్కజొన్నతో పాటు కూరగాయలు విరివిగా పండిస్తారు. మామిడి తోటలు కూడా అధికంగానే ఉన్నాయి. సంబంధిత రైతులను ఆధునిక పద్ధతులపై ఆత్మ ద్వారా చైతన్యం చేయాలి. వ్యవసాయశాఖతో పాటు ఉద్యానవన, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక, మత్స్యశాఖల పరిధిలో కార్యక్రమాలు చేపట్టాలి. రైతులకు క్షేత్ర ప్రదర్శనలు, అవగాహన సదస్సులు నిర్వహించాలి. వ్యవసాయరంగ నిపుణులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు ఇవ్వడానికి సదస్సులు నిర్వహించాలి. మారుతున్న కాలానుగునంగా నూతన వంగడాలను పరిచయం చేయాలి. కిసాన్ మేళాలు నిర్వహించి, ఆధునిక యంత్రాలు, పరికరాలు, డ్రిప్ ఇరిగేషన్, పాలిహౌజ్, మల్చింగ్‌పై అవగాహన కల్పించాలి. అయితే ఇవేమీ కనిపించంలేదు. జిల్లా వ్యాప్తంగా ఆత్మ ద్వారా ఏ ఒక్క కార్యక్రమం చేపట్టడంలేదు. నిధుల కొరతతో ఆత్మ కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి.

నిధులు, విధులు లేని కమిటీలు

ఆత్మ పథకాన్ని 2014లో ప్రారంభించారు. ఈ పథకం అమలు కోసం అప్పటి ప్రభుత్వం కొన్నాళ్లు సక్రమంగానే నిధులు విడుదల చేసింది. దీంతో విరివిగా అవగాహన సదస్సులు నిర్వహించారు. కాని రెండేళ్లుగా నిధులు నిలిచిపోవడంతో సదస్సులు సైతం ఆగిపోయాయి. జిల్లా స్థాయి ఆత్మ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా వ్యవసాయాధికారి కన్వీనర్‌గా ఉంటారు. పథకాన్ని క్షేత్ర స్థాయిలో అమలు చేసేందుకు డివిజన్‌కు ఒక చైర్మన్‌ను నామినేట్ చేసి కమిటీని వేస్తారు. చైర్మన్ నేతృత్వంలోనే ఆయా గ్రామాల్లో కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. నిధుల కొరతతో అధికారులు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. కొత్త ప్రభుత్వం ఆత్మ పథకానికి నిధులు మంజూరు చేసి గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రైతులను చైతన్య పరచాలి..: బండి తిరుపతిరెడ్డి, రైతు, నర్మెట

రైతులకు సాంకేతిక పద్ధతులపై అవగాహన లేక సాంప్రదాయ పద్ధతులతోనే సాగు చేసి నష్టాలు చవి చూస్తున్నారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో పరికరాలను ఉపయోగించడం తప్పనిసరి. ఆధునిక పద్ధతుల్లో సాగు చేసి అధిక దిగుబడులు సాధించేలా రైతులను చైతన్య పరచాలి. గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు పంటల సాగుపై అవగాహన పెంపొందించాలి.



నిధుల కొరతతో సదస్సులు నిర్వహించలేకపోతున్నాం..
- వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

ఆత్మ పథకానికి నిధులు లేకపోవడంతో గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేకపోతున్నాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే రైతులను చైతన్య పరిచే దిశగా కార్యక్రమాలు నిర్వహిస్తాం. రైతులకు సాంకేతికతపై అవగాహన కల్పిస్తాం. క్షేత్ర పర్యటనలు, విజ్ఞాన పర్యటనలు నిర్వహిస్తాం.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, మార్చి 5: కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ పటిష్టత కోసం కష్టపడి పనిచేయాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు, పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే రెండు నెలల్లో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం కార్యకర్తలు కష్టపడి పనిచేసి పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెండు నెలలు కష్టపడితే ఐదేళ్లు పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు. రాజకీయ లబ్ధికోసమే ప్రతిపక్షాలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న పార్టీలకు దీటుగా సమాధానం ఇవ్వాలని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని, పార్టీలో చేరేందుకు చాలామంది చూస్తున్నారని, ఎవరు చేరినా కష్టపడిన వారికే గుర్తింపు ఉంటుందన్నారు. అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ త్వరలో కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి



జఫర్‌గఢ్‌లో మాట్లాడుతున్న రాజారెడ్డి

జఫర్‌గఢ్, మార్చి 5 : ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం జఫర్‌గఢ్‌లో ఎండి. యాకూబ్‌పాషా అధ్యక్షతన జరిగిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. సమస్యలపై శాంతియుతంగా ఉద్యమిస్తున్న రైతులపై కేంద్ర పాలకులు దమనకాండకు పాల్పడుతున్నారన్నారు. అణచివేత విధానాలను మానుకుని రైతులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేకూరుస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తూ అధికారం కోసం ఓట్ల రాజకీయం చేస్తోందని విమర్శించారు. బూటకపు వాగ్దానాలతో మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ సర్కార్‌ను గద్దె దించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో సీపీఐ నేతలు ఆది సాయన్న, పాతూరి సుగుణమ్మ, జువారి రమేశ్, కూరపాటి చంద్రమౌళి, రడపాక సత్తయ్య, మంద బుచ్చయ్య, జాఫర్, పెండ్యాల సమ్మయ్య, మధులాల్ నాయక్, వెంకటయ్య, యాకయ్య, రాజయ్య పాల్గొన్నారు.

ఆటో దగ్ధం



మంటల్లో కాలిపోయిన ఆటో

చిలుపూర్, మార్చి 5 : మండల కేంద్రంలో ఇంటిముందు పార్క్ చేసిన ఆటో తెల్లారేసరికి మంటల్లో కాలిపోయింది. బాధితుడు పోలు రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.... సోమవారం రాత్రి తన ఆటోను ఇంటి ముందు నిలిపి నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో పెద్దఎత్తున శబ్దం రావడంతో ఆయన బయటకు వచ్చాడు. అప్పటికే ఇంటి ముందున్న ఆటో మంటల్లో కాలిపోతూ కనిపించింది. కుటుంబ సభ్యుల సాయంతో మంటలను చల్లార్చారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ముత్యం రాజేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇది గుర్తు తెలియని వ్యక్తులు చేసిన దురాగతమా, లేక షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన ప్రమాదమా అన్నది విచారణలో తేలాల్సి ఉందని ఎస్సై పేర్కొన్నారు.

గుడుంబా తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు

తరిగొప్పుల, మార్చి 5: గుండుంబా తయారు చేస్తున్న మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. తరిగొప్పుల మండలం బొత్తలపర్రె గ్రామానికి చెందిన ముడావర్ అనసూర్య (45) అనే మహిళ గ్రామ శివారులో గుడుంబా తయారు చేస్తుండగా పోలీస్ సిబ్బంది గమనించి మంగళవారం పట్టుకున్నారు. ఆమె వద్ద 4 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై శ్వేత తెలిపారు.

మోపెడ్‌ను ఢీకొట్టిన రెడీమిక్స్ వాహనం

దంపతులకు తీవ్ర గాయాలు



బాధితుడిని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 5: పల్లగుట్ట క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జఫర్‌గఢ్ మండలం ఏబీ తండాకు చెందిన వెంకట్రాంనాయక్-రంగమ్మ దంపతులు చిలుపూర్ మండలం దేశాయితండాకు వెళ్లి మోపెడ్‌పై తిరిగి వస్తుండగా పల్లగుట్ట క్రాస్‌రోడ్డు వద్ద క్రాస్ చేస్తున్న క్రమంలో రెడిమిక్స్ లారీ వెనుకాల నుంచి ఢీకొట్టింది. దీంతో వెంకట్రామ్‌నాయక్ తలకు బలమైన గాయం కాగా రంగమ్మకు తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య గమనించి సహాయ చర్యలు చేపట్టారు. దగ్గర ఉండి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లారు. సీఐ ముస్క రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేక శిబిరం

రఘునాథపల్లి, మార్చి 5: మారుతున్న ప్రస్తుత కాలానికి అనుగుణంగా భవన నిర్మాణ కార్మికులు మెలుకువలు పాటించాలని శిక్షకుడు వేణుగోపాల్ అన్నారు. మంగళవారం కంచనపల్లిలో లేబర్ కార్డు కలిగి ఉన్న కార్మికుల కోసం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ వారి సహకారంతో భవన నిర్మాణ కట్టడాలపై ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్మికులు మెలుకువలు నేర్చుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని అన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవం



హిమ్మత్‌నగర్‌లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అనిత

జఫర్‌గఢ్, మార్చి 5 : మండలంలోని హిమ్మత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం-2లో మంగళవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత మాట్లాడుతూ సమస్యలపై మహిళలు చైతన్యం కావాలన్నారు. మహిళలు, బాలికలపై నానాటికి హింస, వేధింపులు దాడులు వంటి ఘటనలను పెరిగిపోతున్నాయన్నారు. లింగ వివక్ష, బాల్య వివాహాలు వంటి అంశాలపై మహిళలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. మహిళలంతా సంఘటితం కావాలని కోరారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, వివక్షత, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్ మచ్చ శారద, ఆయా నాగలక్ష్మి పాల్గొన్నారు.

జనగామ టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆటలతో అలరించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ధర్మకంచలో గల అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో కబడ్డీ ఆడారు. అనంతరం బహుమ తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళ రాజు, సీడీపీవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఉపాధిహామీ ఉద్యోగులకు జీతాలేవీ?

(5వ పేజీ తరువాయి)

అధికారుల వరకు శ్రమించాల్సిందే. ప్రతీపనికి ముందస్తు ప్రణాళికలు, లక్ష్యాలు తయారు చేయడం, అమలు చేయడం, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయడం వంటివి పూర్తయితేనే కూలీలకు సరైన సమయంలో డబ్బులు అందుతాయి. గత ప్రభుత్వ హయాంలో కొత్త గ్రామపంచాయతీలు ఏర్పడ్డా కూడా కొత్తసిబ్బందిని నియమించకపోవడంతో ఉన్న వారిపైనే పడింది. జనగామ జిల్లాలో సహాయ ప్రాజెక్ట్ అధికారులు 8 మంది, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు 8, సాంకేతిక సహాయకులు 39, కంప్యూటర్ ఆపరేటర్లు కమ్ అక్కౌంటెంట్లు 13, క్షేత్ర సహాయకులు 171 మంది విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్రసహాయకులు ప్రతీ గ్రామానికొకరు అవసరం ఉన్నా ప్రస్తుతం ఒక్కొక్కరు 3, 4 గ్రామాలు చూసుకుంటున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు మండలానికి ఇద్దరు ఉండాల్సి ఉండగా మొత్తం 13 మండలాలకు గాను 13 మంది మాత్రమే ఉన్నారు. ఇంత కష్టపడుతున్నా 4 నెలల నుంచి జీతాలు అందక వారు అప్పులపాలవుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వేతన బకాయిలు క్లియర్ చేసి ఏ నెల జీతం ఆ నెలఅందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ముగిసిన మేడారం హుండీల లెక్కింపు

జాతర ఆదాయం రూ.12,71,79,280

హనుమకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఆదాయం మొత్తం రూ.12,71,79,280 లెక్క తేలింది. గత జాతర కన్నా రూ.26,29,553 ఎక్కువ. గత జాతర ఆదాయం రూ. 12,45,49,727. దీనితో పోల్చితే ఈసారి జాతర ఆదాయం ఏ మంత ఎక్కువ పెరగలేదు. ప్రతీ జాతరకు ఆదాయం రూ. కోటిపైనే పెరుగుతూ వచ్చింది. ఈ సారి మాత్రం ఆశించినంత పెరగలేదు. గత జాతర కన్నా ఈ సారి భక్తులు ఎక్కువగానే వచ్చినట్టు అంచనా. హుండీలను కూడా గతంలో కన్నా ఎక్కువగానే ఏర్పాటు చేశారు.. అయినా జాతర ఆదాయం పెరుగుదల రూ.26లక్షలకే పరిమితమైంది. కాగా, మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర హుండీల లెక్కింపు మంగళవారంతో ముగిసింది. ఆరో రోజు 50 హుండీలను లెక్కించగా రూ.1,46,09,280. జాతరలో భక్తులు బంగారం, వెండి రూపంలో వేసిన కానుకలను కూడా మంగళవారం మదింపు వేశారు. బంగారం 779 గ్రాముల 800 గ్రాములు కాగా, వెండి 55 కిలోల 150 గ్రాములు వచ్చింది. దీనిని బ్యాంకు ట్రెజరీలో భద్రపరిచారు. గత జాతర కన్నా ఈసారి బంగారం, వెండి కానుకలు కాస్త ఎక్కువగా వచ్చాయి. లెక్కించిన ఉండీ ఆదాయాన్ని బ్యాంకులో జమచేశారు. హుండీల నుంచి వెలువడిన బియ్యం మొత్తాన్ని జల్లెడపట్టి బస్తాల్లో నింపారు. నాణాలను లెక్కించాల్సి ఉంది.

చేతిరాతలో నైపుణ్యం సాధించాలి



విద్యార్థులకు చేతిరాతలో శిక్షణ ఇస్తున్న మిరాజ్

జనగామ కల్చరల్, మార్చి 5: విద్యార్థులు చేతిరాతలో నైపుణ్యం సాధించాలని అక్షర హ్యాండ్ రైటింగ్ ఇంప్రూవ్‌మెంట్ సెంటర్ నిర్వాహకులు మిరాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు లుసిడా హ్యాండ్ రైటింగ్ వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. పాఠశాలకు చెందిన 88 మంది తొమ్మిదవ తరగతి విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. అనంతరం ఈ శిక్షణ ద్వారా నైపుణ్యం సాధించిన ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఒక్కొక్కటి రూ.250.ల విలువ గల లుసిడా ప్రాక్టీసింగ్ నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా మిరాజ్ మాట్లాడుతూ హ్యాండ్ రైటింగ్ ఇంప్రూవ్‌మెంట్ ద్వారా 10/10 గ్రేడ్ పాయింట్స్ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉప్పలయ్య, ఉపాధ్యాయుడు చొక్కయ్య పాల్గొన్నారు.

రఘునాథపల్లి ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక

రఘునాథపల్లి, మార్చి 5: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మండల ప్రెస్ క్లబ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల మహేష్, ప్రధాన కార్యదర్శిగా కందుల అనిల్, కోశాధికారిగా కొన్నె సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో దస్తగిరి, పుల్ల రవి, బంద రవిందర్, రాజు, శివరాం, సుంకరి శ్రీనివాస్, స్వామి, కొలుపుల రవి, కృష్ణమూర్తి, మల్లేష్, మేకల రవిందర్, జగన్, అజిత్, రంజిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఎం నేతకు పితృ వియోగం

బచ్చన్నపేట, మార్చి 5: సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్‌కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి సీపీఎం సీనియర్ నేత బెల్లంకొండ సుధాకర్ (70) మంగళవారం మృతి చెందారు. సీపీఎం జనగామ, సిద్దిపేట జిల్లాల కార్యదర్శులు మోకు కనకారెడ్డి, ఆముదాల మల్లారెడ్డితో పాటు సీనియర్ నాయకులు నివాళులు అర్పించారు. నమ్మిన సిద్ధాంతం కోసం మూడు తరాలుగా సుధాకర్ కుటుంబం పనిచేస్తోందన్నారు. అనేక ఉద్యమాల్లో పాల్గొన్న సుధాకర్ మృతి సీపీఎంతో పాటు బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు తీరని లోటన్నారు. సమాజానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నక్క యాదవరెడ్డి, సుంచు విజేందర్, ఇర్రి అహల్య, రాపర్తి రాజు, సత్తిరెడ్డి, బూడిద గోపి, వెంకట్‌మావో, బొట్ల శ్రీనివాస్, అశోక్, రవీందర్‌రెడ్డి, రాజు తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.